## క్లుప్తంగా

### ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథస్వామి ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం కోసం రాష్ట్ర దేవదాయ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల్లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ ఈవో కె.నరసింహనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్టీ బోర్డు చైర్మన్‌గా వంశపారంపర్య ధర్మకర్త, గవర్నర్ పూసపాటి అశోకగజపతిరాజు, ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఆలయ ప్రధానార్చకులు సీహెచ్. సీతారామనృసింహాచార్యులుంటారని, మిగిలిన 9 మంది సభ్యులు కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను శ్రీకాకుళం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో గానీ, శ్రీకూర్మనాథ దేవస్థానం ఈవో కార్యాలయంలో గానీ అందించవచ్చని పేర్కొన్నారు.

### మున్సిపల్ కార్మికుల ఆందోళన



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతి రావు ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఉదయం 5.30 గంటలకు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఆయా డివిజన్, సచివాలయం పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

### చెక్కులు పంపిణీ

రణస్థలం: పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా అండగా ఆదుకుంటుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో శనివారం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.

### రాములు మృతికి సంతాపం

జి.సిగడాం: ఉల్లివలస గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, డి.ఆర్.వలస మాజీ ఎంపీటీసీ సభ్యుడు మామిడి బలరాం తండ్రి రాములు(80) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. రాములు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీపీ మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, సర్పంచ్‌లు కుమరాపు శ్రీనివాసరావు, చందక సతీష్, ఎంపీటీసీ సభ్యుడు కుమరాపు రమేష్‌నాయుడు తదితరులు సంతాపం తెలియజేశారు.

### ఘనంగా రాఖీ పండగ



పోలీసులకు రాఖీలు కడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం కల్చరల్/జి.సిగడాం: ప్రతిఒక్కరూ సోదరభావం పెంపొందించుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.చందు అన్నారు. సంఘ బాలికా విభాగం ఆధ్వర్యంలో రక్షాబంధన్ సందర్భంగా శనివారం శ్రీకాకుళం ఎస్పీ కార్యాలయ సిబ్బంది, వన్ టౌన్ ఎస్‌ఐ హరికృష్ణ, టూ టౌన్ ఎస్‌ఐ సంతోష్‌లతో పాటు 200 మందికి రాఖీలు కట్టారు. కార్యక్రమంలో యూనియన్ సహాయ కార్యదర్శి పి.ఖగేష్, ఉపాధ్యక్షుడు సీహెచ్ రాజు, జిల్లా బాలికా విభాగం సభ్యులు వందన, శిరీష, చాందిని, సిరి తదితరులు పాల్గొన్నారు. మండలవీధిలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాఖీ పండగ ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారిలు బి.కె.శారద, జయలక్ష్మీలు పట్టణ ప్రముఖులకు, పోలీసు అధికారులకు, వైద్యులకు రాఖీలు కట్టి పండగ విశిష్టతను తెలియజేశారు.

### ఉమాకవికి స్వరకిరీటి పురస్కారం



శ్రీకాకుళం కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోషియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో శనివారం జరిగిన 2025 సింగర్స్ ఫెస్ట్‌లో బాల కథానిలయం వ్యవస్థాపకుడు ఉమాకవిని స్వరకిరీటి పురస్కారంతో సత్కరించారు. ఒకే కులం ఒకే మతం.. అందరూ ఒకటే అనే గీతాన్ని ఆలపించినందుకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

### ఐఎంఎల్ డిపో విభజించవద్దు

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విభజించవద్దని హమాలీలు శనివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు పొట్టకొట్టేలా విభజన ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎం.సురేష్, ఎస్.రమణ, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, రాజు, కె.వి.రమణ పాల్గొన్నారు.

వత్సవలస వద్ద నీరు లేని వంశధార కుడి కాలువ





వాడిపోతున్న వరి నారుమడులు

# కానరాని నీరు.. రైతు కంట కన్నీరు!

- శివారు ప్రాంతాల్లో సాగునీటి కష్టాలు
- కాలువల్లో నీరు రాక ఎండిపోతున్న పొలాలు
- పట్టించుకోని పాలకులు

గార: సాగునీరు అందించడంలో పాలకుల నిర్లక్ష్యం .. మరోవైపు వాతావరణం అనుకూలించకపోవడం వెరసి కర్షకులకు కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచే అన్నదాతలకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఒకవైపు వర్షాలు కురవక, మరోవైపు కాలువల్లో సాగునీరు రాక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. వేసవిని తలపించేలా ఎండలు మండుతుండటంతో వారి నారు, ఎదలు, నాట్లు ఎండిపోతున్నాయి. ఖరీఫ్ సీజన్ ముందు ఈ ఏడాది అధిక వర్షాలున్నాయని చెప్పడంతో రైతులు సంతోషం చెందారు. ఆ ఆనందం అన్నదాతలకు ఎంతోకాలం నిలవలేదు. వర్షాలు ముఖం చాటేయడంతో వెద సాగులో మొక్కలు చనిపోతున్నాయి. చెరువులు కూడా నిండకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంత రైతులకు సాగునీటి కాలువలు ద్వారా నీరు అందకపోవడంతో నార్లు ముదిరిపోతున్నాయి. ఈ విషయాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు.

**ఇదీ పరిస్థితి..**

- గార మండలంలో ఈ ఏడాది 17,260 ఎకరాల్లో వరి సాగవుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. నారాయణపురం, వంశధార కుడి ప్రధాన కాలువ, భైరిదేశిగెడ్డ కాలువల ద్వారా శివారు భూములకు సాగునీరు అందాల్సి ఉంది.
- నారాయణపురం చానెల్ పరిధిలో సాగునీరు కొంత ఆశాజనకంగా ఉన్నా.. వంశధార, భైరిదేశిగెడ్డ శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదు. మెట్ట ప్రాంతాల్లో కాలువలు, వర్షాలు ఆధారంగా ఉన్న వరి పంట వాడిపోవడంతో రైతులు కంట కన్నీరు వస్తోంది. ఇదే సమయంలో వర్షాలు కూడా లేకపోవడం, ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో ఉండటంతో నారు చనిపోతోంది.
- భైరిదేశిగెడ్డ పరిధిలో వమరవల్లి ఆయకట్టు రైతాంగానికి చుక్క నీరు కూడా అందడం లేదు.
- కళింగపట్నం, వమరవల్లి, తోనంగి ప్రాంతాల్లో సుమారు 6 వేల ఎకరాలు వరి సాగవ్వాల్సి ఉండగా, కనీసం 30 శాతం కూడా ఇంకా సాగులోకి రాలేదు. వేసిన వరి వెద సాగు సైతం ఎండిపోతోంది. ఆ ప్రాంతంలో వ్యవసాయ బోర్లు ద్వారా కొంత నీరు అందించి వరిపైరును కాపాడుకుంటున్నారు.
- వంశధార కాలువకు సంబంధించి కొత్తూరు సైరిగాం, తండ్యాలపేట, యాళ్లపేట, తండ్యాలపేట, వత్సవలస ప్రాంతాలకు సాగునీరు అందాల్సి ఉన్నా ఇంతవరకు నీరు చేరలేదు. ఇప్పటికైనా సంబంధిత సాగునీటి శాఖాధికారులు శివారు ప్రాంతాలకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వమరవల్లి- కళింగపట్నం ప్రాంతాలకు వెళ్లే భైరిదేశిగెడ్డ కాలువ

### ఎదురుచూపులే..



వంశధార కుడి కాలువ నుంచి సాగునీరు అందాల్సి ఉంది. వరి వెద, ఆకులు చల్లి నెల రోజులు దాటినా వర్షాలు కురవకపోవడం, కాలువల్లో నీరు లేకపోవడంతో మొక్కలు చనిపోతున్నాయి. అధికారులు, నాయకులకు చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రైతులంతా ఆందోళన చెందుతున్నారు. – **పూట ఎర్రంనాయుడు, తండ్యాలపేట, శ్రీకూర్మం పంచాయతీ**

### ప్రయోజనం లేదు



ఈ ఏడాది మా ప్రాంతానికి సాగునీరు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నాం? సాగునీటి అధికారులకు సమాచారమిచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. చెరువుల్లో కూడా నీరు లేకపోవడంతో ఆకులు కాపాడుకోవడం కష్టంగా మారింది. శివారు ప్రాంతం కావడంతో ఎవ్వరూ దృష్టిసారించడం లేదు. – **తామాడ గణపతి, రైతు, వత్సవలస**

### ఆకాశం..ఆహ్లాదకరం



మండుటెండలతో విలవిల్లాడుతున్న ప్రజలకు శనివారం సాయంత్రం కాస్త ఉపశమనం లభించింది. ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు వీయడంతో కాసేపు సేదతీరారు. జి.సిగడాం మండలం పాలఖండ్యాం–టి.డి.వలస గ్రామాల మధ్య ఇలా మేఘాలు కమ్ముకుని ఆహ్లాదకర దృశ్యం ఆవిష్కృతమైంది. – జి.సిగడాం

### పొంచి ఉన్న ప్రమాదం



లావేరు మండలం తాళ్లవలసలో జాతీయ రహదారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. వైరు బయట వేలాడుతుండటంతో పాటు చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో స్థానికులే స్పందించి తాత్కాలికంగా గుడ్డ కట్టారు. లో–వోల్టేజ్ సమస్య కూడా వేధిస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – రణస్థలం

### కాలువకు మోక్షమెప్పుడో?



రణస్థలం మండల కేంద్రంలోని జే.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలోని సీసీ కాలువలు నిర్మిస్తామంటూ తవ్వి వదిలేశారు. నెల రోజులు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇళ్ల ముందు మెట్లు తొలగించడంతో పాటు మూడు అడుగులు లోతు తవ్వేయడంతో వృద్ధులు, చిన్నారులు నరక యాతన పడుతున్నారు. ఇప్పటికైన పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. – రణస్థలం

### ట్రాఫిక్ పరేషాన్..



పెదపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం రాత్రి 7 గంటల సమయంలో భారీ ట్రాఫిక్ ఏర్పడింది. ఈ ప్రాంతంలో కల్వర్టు పనులు జరుగుతుండటం, మరోవైపు రోడ్డు పేనే మెటీరియల్ వేయడంతో కొద్ది రోజులుగా ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. సుమారు రెండు గంటలు వాహనాలు బారులు తీరడంతో రూరల్ పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. – శ్రీకాకుళం రూరల్

## రైతులను ఆదుకోని ప్రభుత్వం ఎందుకు?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్ట్‌ల ద్వారా సాగునీరు ఇవ్వకపోవడం, సకాలంలో ఎరువులు సకాలంలో సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం వాండ్రంగి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా సుపరిపాలన తొలి అడుగు పేరుతో గ్రామాల్లో నాయకులు పర్యటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలను మోసం చేయడమే సీఎం చంద్రబాబు నైజమన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వృద్ధులు, దివ్యాంగులు, యువత ఇలా అన్ని వర్గాలను బూటకపు హామీలతో మోసం చేశారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులు ఈసర్ల గోవిందరావు, చిత్తిరి మోహన్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## దాడులతో ప్రజల ఓట్లు సంపాదించలేరు



15వ డివిజన్‌లో బాబుష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి నాయకులు దాడులు, దౌర్జన్యాలు చేసి ప్రజలను భయపెట్టి గెలవాలనుకోవడం పగటి కల అని వైఎస్సార్ సీపీ నాయకురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని సంక్షేమ పథకాలు అందించాలే తప్ప రౌడీ రాజకీయాలతో ప్రజల మనసులు గెలుచుకోలేరన్నారు. శ్రీకాకుళం నగరంలోని 15వ డివిజన్ ఇన్‌చార్జి లంక రమేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఏ తలుపు తట్టినా పథకాలు ఇవ్వలేదు.. అభివృద్ధి లేదు.. చంద్రబాబు చేతిలో మరోసారి మోసపోయామని ప్రజలు చెబుతున్నారన్నారు. పాలకులంటే వైఎస్సార్, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, మీడియా సెల్ ఇన్‌చార్జి మండవల్లి రవి, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు రౌతు శంకరరావు, సీపాన రామారావు, పాపారావు స్వామి, మహిబుల్లాఖాన్, కర్రి రంగాజీదేవ్, సీహెచ్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న కక్షసాధింపులు

- వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల భూములపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్లు
- కూటమి మద్దతుదారుల భూముల మినహాయింపు



స్వాధీనం చేసుకున్న ప్రొక్లెయిన్



రైతుల పొలాల్లో వేసిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్డు

శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో కక్ష సాధింపు చర్యలు రోజురోజుకూ మితిమీరుపోతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రోడ్లు పేరిట వైఎస్సార్ సీపీ మద్దతుగా ఉన్న రైతుల భూములను నిర్వీర్యం చేసేస్తున్నారు. అదే ప్రాంతంలో ఉన్న కూటమి నాయకుల భూములను మాత్రం అధికారులు మినహాయిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలం బైరి ప్రారిసర ప్రాంతంలో సర్వే నంబర్ 92 (3)లో ఎకరా 40 సెంట్ల విస్తీర్ణంలోని భూమిని బైరి వెంకటేష్ అనే వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు సాగు చేసుకుంటున్నాడు. కొన్నేళ్లుగా అదే భూమిలో వివిధ రకాల పంటలు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆ భూమి మీదుగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్డు పేరిట కొంతస్థలాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు లాగేశారు. ఇది అక్రమమంటూ సదరు భూమిని శనివారం సాయంత్రం ప్రొక్లెయిన్ పెట్టి చదును చేస్తుండుగా కొంతమంది టీడీపీ మద్దతుదారులు కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### కోర్టు పరిధిలో ఉన్నా..



నాకున్న ఎకరా 40 సెంట్ల భూమిలో సుమారు 40 సెంట్ల స్థలాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్డు పేరిట లాగేశారు. నా భూమిని ఆనుకొని ఉన్న కూటమి నేతలు భూములను ముట్టుకోకుండా రోడ్డును ఇరుకుగా వేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టులో కేసు నడుస్తున్నా అధికారులు మాపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. – **బైరి వెంకటేష్, రైతు, బైరి**

### తీర్మానం మేరకే..



ప్రభుత్వ గోర్జులు, చెరువులు ఉంటే ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులద్వారా రోడ్లు వేసుకోవచ్చని గత ప్రభుత్వ హయాంలోనే తీర్మానం చేశారు. ఇటీవల బైరి గ్రామంలో రైతుల పొలాల మధ్య వేసిన రోడ్డును కొందరు రైతులు ఛిన్నాభిన్నం చేయడంతో వాటిని పరిశీలించేందుకు వచ్చాం. 18 అడుగులు రోడ్డుకుగాను 12 అడుగులతోనే సరిపెట్టేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. – **బాలముకుందరావు, ఉపాధి అధికారి**

### వేడుకగా ఊయల ఉత్సవం



రణస్థలం: కోష్ట సమీపంలోని శ్రీకృష్ణ చైతన్య మఠం గో–సేవా ఆశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని శనివారం బలరామ జయంతి, రాఖీ పౌర్ణమి సందర్భంగా రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫలాలతో స్వామివారిని అలంకరించి ఊయల ఉత్సవం జరిపించారు. ఈ నెల 18 వరకు ఉత్సవాలు కొనసాగుతాయి.

### మొక్కలకు దిక్కెవరు?

కూటమి ప్రభుత్వం తీరు ఆరంభ శూరత్వంలా మిగిలిపోతోంది. హడావుడిగా కార్యక్రమాలు చేపట్టడం.. తర్వాత వాటి సంగతి మార్చిపోవడం పరిపాటిగా మారుతోంది. ఈ ఏడాది రథసప్తమి ఉత్సవాల సందర్భంగా సుందరీకరణలో భాగంగా అరసవల్లి మిల్లు కూడలిలో 'ఆరోగ్యం భాస్కరాదిత్యేత్' పేరిట అధికారులు మొక్కల స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను కొన్నాళ్లుగా గాలికొదిలేయడంతో మొక్కలు ఎండిపోయాయి. ఆ ప్రాంతమంతా కళావిహీనంగా దర్శనమిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

